


సాయంత్రం అయిదయింది. పూర్తిగా ఎనిమిది గంటలు డ్యూటీ చేసి ఇంటికి దిస్సగా రావడం వలన చాలా బడలికంగా, చిరాకుగా ఉంది. అప్పుడే వచ్చిన శ్రీమతి ఉత్తరం నా చిరాకుని మరికాస్త పెంచింది. రిజర్వేషను ఇప్పట్లో దొరికేటట్లు లేదనీ, అదీగాక "కాస్త చల్లబడేవరకు" ప్రయాణం పెట్టుకోవద్దని వాళ్ల వాళ్లు అంటున్నారనీ, ఇలాగయినందుకు క్షమించమనీ సారాంశం. ఈ ఆడాళ్లు ఎప్పుడూ ఇంతే. ఓసారి పుట్టింటికెళ్లిన ఆడది వస్తానన్న రోజుకి తిరిగి రావడం అనేది నేనింతవరకూ కనలేదు. వినలేదు.

నేను ఈ కంపెనీలో చేరి నెలకావస్తోంది. ఇది పేరుకి మైసూరు రాష్ట్రంలో ఉన్నా సరిహద్దు కాబట్టి తెలుగు, అరవం కూడా బాగా వినిపిస్తాయి. గత పదేళ్లుగా "నార్త్ ఇండియా" లో పనిచేసి అనుకోకుండా ఇక్కడికి బదిలీ కావడంతో నెల రోజులు పెళ్లాం పిల్లలకి ఆటవిడుపు ఇచ్చేసి ఒక్కడినీ వచ్చి చేరాను ఇక్కడ. కొత్తగా చేరిన వాళ్ళకి క్వార్టర్సు దొరకడం చాలా కష్టం కాబట్టి దగ్గరున్న ఈ ఊరినుంచి వెళ్లివస్తున్నాను. ఇది పల్లెటూరు అనుకోడానికి వీలు లేదు, పట్నం అనుకోడానికీ లేదు. మా కంపెనీ ధర్మమా అని నాగరికపు హంగులు కొద్ది కొద్దిగా సంతరించుకొంటోందీఊరు. అప్పుడప్పుడు వచ్చే తెలుగు సినిమాలు, అప్పుడప్పుడు తెరిచే అణా లైబ్రరీ కాలక్షేపానికి సరిపోకపోవటంతో ఇబ్బందిగా ఉంటోంది ఉగాది ఉత్సవాలు, శ్రీరామనవమి 'ప్రోగ్రాములు' కూడా అయిపోయాయి మొన్నటితో ఇప్పుడు మా నాయుడుగారి ఎలక్ట్రికల్ షాపులోనే టైము గడుపుకోవలసి వస్తోంది. ఈయనకి మైకు సర్వీసుకూడా ఉంది. ఈ చుట్టుపక్కల జరిగే చాలా ప్రోగ్రాములకి నాయుడిదే కాంట్రాక్టు. సుబ్బలక్ష్మి పాటలు, హిందీ పాపులర్ సాంగ్స్, ఎల్లారీశ్వరి శృంగార గీతాలు – ఇలాంటి రక రకాల రికార్డులు ఉన్నాయి.

మొహం కడుక్కొని బట్టలు మార్చుకుని షాపులోకి వచ్చి కూర్చున్నాను. నాలుగు రికార్డులు విన్నానో లేదో హడావుడిగా నాయుడు వచ్చాడు. వస్తూనే "అయ్యవార్లా

# పంజరాలు

కస్తూరి సత్యరామప్రసాద్



అర్జెంటుగా సింగరపల్లె పోవాలి. మా బామ్మరిది అర్జెంటుపని తగిలిందని లైటింగు పని నాకు అప్పగించి పోయినాడు. మీరు కూడా రాండి. రేపు సెలవేకదా!'' అన్నాడు. ''ఆ ఊరంతా నాకు కొత్త, నాకు తోచే దెట్లాగ?'' అన్నాను.

నాయుడు నవ్వాడు. ''దండిగా కాలక్షేపం అవుతుంది. అక్కడ రథం ఊరేగింపుకి లైటింగు అరేంజిమెంటు అంతా మాదే. మా టెక్నిక్కు చూడగా?'' అన్నాడు.

''రథం ఊరేగింపు ఒక్కటే అయితే ఎందుకూ దండగ'' అంటూ నసిగాను నా అభిప్రాయాన్ని కనిపెట్టేసేడు నాయుడు. ''ఇంకా చాలా ఉన్నాయి' ముఖ్యంగా బాల మురగన్ పార్టీ వాళ్ళ రికార్డింగు డాన్సు హుషారుగా ఉంటుంది. మర్చిపోయినాను, ఆ నీలం పెట్టెలో ఉన్న రికార్డులన్నీ ఇలా ఇయ్యండి ఈ ప్రోగ్రాముకని పెడిగా అవన్నీ అందులో పెట్టినాను.'' అని రికార్డులు తీసుకున్నాడు.

చాలా కాలంగా రికార్డింగు డాన్సుల గురించి వినడమేగాని ఇప్పటివరకూ చూడడం సాగలేదు మొన్నటి ప్రోగ్రాములలో కూడా కొంచెంలో తప్పిపోయింది. సరదాకి ఈ సంగతి నాయుడితో ఓమారు అన్నాను. బాగానే గుర్తు పెట్టుకున్నాడన్నమాట. మనసులోని ఆసక్తిని బయట పడనీయకుండా నాయుడితోపాటు ప్రయాణానికి సిద్ధమయ్యాను.

బస్సు వచ్చేలోగా ఆ ఊళ్లోని మిగతా ప్రోగ్రాముల వివరాలు కూడా ఏకరువు పెట్టాడు నాయుడు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆ రోజు అక్కడి టెంటు సినిమాహాల్లో మర్నాడు పొద్దున్నవరకు నాలుగు వేరు వేరు సినిమాలు చూపిస్తారుట. ప్రఖ్యాత సినీనటుడు సుందరకుమార్ కూడా వస్తున్నాడుట. ఇదికాక విల్లుపురం దండపాణి అండ్ పార్టీ వాళ్ళ నాగస్వర కచేరీ, కేరళా వాళ్ల వీధి డాన్సొకటీ కూడా ఉన్నాయట.

మేం ఎక్కిన సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సు లేదంటే పది ఊళ్లలో పదేసి నిమిషాలకి తక్కువ కాకుండా ఆగి రాత్రి ఎనిమిదిన్నరకి సింగార పల్లెలో పడేసింది.

నాయుడికి పలుకుబడి బాగా ఉన్నట్టుంది. ఆ ఊరి చైర్మనుగారు స్వయంగా మాకు ఆతిథ్యం ఇచ్చారు. ఎంతయినా చోటా రాజకీయ నేత గనుక సందర్భోచితంగా పట్టు వస్త్రాలు ధరించి నామంకూడా దిద్దుకున్నాడు. సింగార పల్లెలోగల పాలిటిక్సూ, ఈ సంవత్సరపు పంటల పరిస్థితి (పెదవి విరుపుతో) ఈ రోజు రాబోతున్న సినిమా నటుడి గొప్పతనం, అతగాడిని తీసుకురావడానికి తను పడిన శ్రమ (కళ్లలో మెరుపుతో) సగం కన్నడంలోను, సగం తెలుగులోను వర్ణించాడు. సినిమా యాక్టరు గురించి మాట్లాడే సమయంలో అతనికి ఎదురు సన్మానం వెళ్ళాలని గుర్తొచ్చి ఉంటుంది, మమ్మల్ని వాళ్ళ అసిస్టెంటాడికి వప్పజెప్పి ఆయన హడావుడిగా బయటకి వెళ్ళిపోయాడు.

నాయుడు తన లైటింగు ఏర్పాట్లలో పడబోతున్నాడు ''నాయుడుగారూ, నన్నేం చేయమంటారు?'' అన్నాను ముందే చెప్పినానుకదా! ప్రోగాములు దండిగా ఉండాయి. మీకు కావలసిన రికార్డింగు డాన్సు మొదలెటే సరికి శానా లేటవుద్ది. ఇట్లా చేయండి. చైర్మను పేరు చెపితే ఫ్రీగా రిజర్వుడులో చూడచ్చు. మీకు నచ్చిన సినిమా మీకు ఇష్టమైనంత వరకు చూడండి. ఏదో ఒక టైములో మా లైటింగు మాత్రం చూడండి. పదకొండున్నరకు సినిమాయాక్టరు వస్తాడు.'' పని చేసుకుంటూనే చెప్పుకుపోతున్నాడు నాయుడు. రికార్డింగు డాన్సు విషయంలో అంత బయట పడిపోవడం నాకిష్టంలేక, ''ఆ, రికార్డింగు డాన్సుదేం ఉంది లెండి కొంచెంసేపే చూస్తాను. ఇంక సుందర్‌కుమార్ అంటారా, అతను వస్తాడని నాకు నమ్మకంలేదు. అయినా అతని సినిమాలు చూస్తూనే ఉన్నాం కదా! పైగా మనం అనుకున్నంత అందంగా బయటి ప్రపంచంలో అతడు కనిపించకపోతే అతనిమీద మనకి గ్లామరుపోయే ప్రమాదం ఉందికదా!'' అంటూ పందిళ్ళవైపుకి నడిచాను.

నాదస్వర కచేరి జరుగుతోంది ఒకమూల. "రామభక్తి సామ్రాజ్యం" అనే కృతిని వాయిస్తున్నారు. వాళ్ళ మెడల్లోని మెడల్సు వాళ్ళ గత వైభవానికి చిహ్నంగా మెరుస్తున్నాయి. పాట శ్రావ్యంగానే ఉంది గాని వాళ్ళలో ఎక్కువగా హుషారు కనిపించడం లేదు. అక్కడ పట్టుమని పదిమందైనా లేకపోతే కళాకారులకి ఉత్సాహం ఎల్లా గుంటుంది? ఉన్న కొద్ది మంది మాత్రం తన్మయత్వంతో తలలు ఊపుతున్నారు. ఈ రకం 'పాత చింతకాయ పచ్చడి' సంగీతాన్ని ఆదరించే ఇలాంటి వాళ్ళు ఇకముందు ముందు అసలే ఉండకపోవచ్చు.

మొదటి ఆట వదిలిపెట్టేశాడు లాగుంది, సినిమాహాలు వైపునుంచి 'నమో వెంకటేశా' పాట వినిపిస్తోంది. ఇప్పుడు చూపబోయే




## సంబరాలు

సినిమా 'భామావిజయం' నేను ఇదివరకు చూసిందే. తరవాతది ఏదో డబ్బింగు చిత్రం. తెల్లవారు జామున మూడింటికి దేవదాసు సినిమా ఉంది. తెల్లవారేలోగా అన్ని సినిమాలనీ చూపించేయాలనే ఆదుర్దాతో ఇంటర్వెల్ కూడా లేకుండా చేస్తున్నాడుట. హాలుకి ప్రక్కన ఉన్న తడికలకొట్లో అరకప్పు టీ తాగి లోపలికి వెళ్ళాను అప్పటికే సినిమా మొదలయిపోయిందిట. చైర్మనుగారి పేరు చెప్పి 'రిజర్వుడు'లో కూర్చున్నాను. రిజర్వుడు అంటే ఏంలేదు. ఈ టూరింగు టాకీసులోని పెర్మనెంటు చప్టా అది. చూడడానికి బాగుండకపోయినా ఒకరకంగా ఇదే నయం అనిపించింది. ఎందుకంటే దీనివలన నల్లుల బాధ ఉండడానికి ఆస్కారం లేదు. స్థిమితంగా సర్దుకుని సినిమా చూడడంలో నిమగ్నుడనయాను. ఒక పావుగంట ఆట అయిందో లేదో 'భూపతి జంపితిన్' అనే పద్యం దగ్గరకి వచ్చేసింది సినిమా. ఇదేమిటి, సినిమా ఇప్పుడిప్పుడే గదా మొదలయింది, అప్పుడే అయిపోతోందేమో అనుకొంటూంటే క్రింది తరగతి ప్రేక్షకులలో గగ్గోలు మొదలయింది. (రీలు తలక్రిందులు అయిన కారణంగా) ఈలలు; కేకలు, తిట్లు ఎక్కువ కాసాగాయి. కొందరు బెంచీల మీద నిలబడి బొమ్మలు కనిపించకుండా చేతులు అడ్డం పెట్టసాగారు. దాంతో ఆపరేటరు మరీ గాభరా పడిపోయాడేమో, శుభం కూడా చూపించేసి, సినిమాని మళ్ళీ మొదటికి తీసుకొచ్చాడు. ఈ విధంగా సినిమాని అరగంట చూసేసరికి "కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్" అనేపాట గుర్తుకొచ్చింది. తెల్లవారు జామున మూడు గంటలకి చూపించే దేవదాసు సినిమాలో ఈ పాటని వినడమే కాకుండా, అదే చిత్రాన్ని కామెడీగా చూసే సదవకాశం కూడా లేకపోలేదనిపించింది. వాచీ చూసుకున్నాను పదకొండున్నరయింది. ఈ పాటికి రికార్డింగు డాన్సు మొదలుపెట్టి ఉంటారు. ఈ సినిమా చూసినంత మేరకి చాలా వినోదంగానే ఉందనుకొంటూ బయటకి వచ్చాను.

ఏ ప్రోగ్రాముకీ లేని జనం ఉన్నారు రికార్డింగు డాన్సు దగ్గర. అప్పుడే మొదలు పెట్టారుట. జోరుగా నడుస్తోంది. మా వూళ్ళోని ముఖాలు చాలా కనిపించాయి అక్కడ. పలకరించడానికి సమయం, సందర్భం కాదు కాబట్టి, ఏమీ ఎరగనట్టుగా దృష్టి డాన్సులమీదనే సారించాను.

"బాబీ"లోని "నామాంగూ సోనా చాందీ" రికార్డు మొదలయింది. దానికి అనుగుణంగా ఒక జంట 'నృత్యం' మొదలెట్టింది. ఆ పాట సినిమాలో ఒక బృందగానం. దానికి ఈ శృంగారపు నృత్యానికీ ఏం సంబంధమో అర్థం కాలేదు నాకు. నడుం ఆధారంగా ముందు వెనకలకీ, కుడి ఎడమలకీ ఒకళ్ళనొకళ్ళు అంటుకోవడం తప్పించి వాళ్ళు వేరే చేస్తున్నది ఏమీలేదు. పాట అయిపోయినా వాళ్ళు బల్లలు దిగలేదు ఒక ఫోటోగ్రాఫరు వచ్చి వాళ్ళ భంగిమని 'క్లిక్' మనిపించాక బల్ల దిగారు. నేను ఒక ప్రక్కనుండి చూస్తున్నాను గనుక, నా ప్రక్కనుండే వాళ్ళు లోపలికి వెళ్ళారు. ఇద్దరి ముఖాలమీద అరంగుళం దళసరి తెల్లకోటింగులు కనిపించాయి. ఈ మేకప్పు లేకపోతేనే వాళ్ళు చూడ్డానికి కొంచెం బాగుండేవారేమో అనిపించింది.

ఈలోగా మరో జంట వచ్చింది. ఇందాకటి వాళ్ళకంటే కొంత నీట్లీనయం అన్నట్టున్నారు వీళ్ళు. "హీరోయిను" పరికిణీ, జాకెట్టు మాత్రం వేసుకుంది. వేస్తున్న పాట "వెంగావి రంగుచీర కట్టుకున్నచిన్నది" తరువాత రెండుమూడు తమిళ యుగళ గీతాలు వినిపించారు, "పురజనుల కోరికపై" నాలుగు ఎల్లారీశ్వరి పాటలు కూడా ఈ ప్రోగ్రాముకి హైలెట్‌గా చోటుచేసుకున్నాయి.

చూసి చూసి నాకు విసుగొచ్చింది. పోనీ సినిమా హీరో సుందర కుమార్‌ని చూసి ఆ తరువాత సినిమాకి రావచ్చు అని పందిరి వైపునడుస్తోంటే ఎవర్తో కొందరు ఆడవాళ్ళు రికార్డింగు డాన్సువాళ్ళనీ, వాళ్ళని రప్పించిన ఆర్గనైజర్లని తిట్టుకోవడం వినిపించింది.

పన్నెండయినా సుందర్‌కుమార్ రాకపోవడంతో ప్రజల్లో నిరాశ, నిస్పృహ పెరిగిపోసాగాయి. చైర్మనుగారి అసిస్టెంటుని సంగతేమిటని అడిగాను. సుందర్‌కుమార్ ఈ రోజు అసలు రావడంలేదనీ, రెండువందల మైళ్ళ అవతల (మితిమీరి త్రాగిన కారణంగా) స్పృహలేకుండా పడి ఉన్నాడనీ చెపుతూ, ఈ సంగతి వేరే కార్యక్రమాన్ని ఏర్పాటుచేసే

దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17.

**1975-76 ఫలితాలు**

మీరు వ్రాస్తున్న వేళ తెల్పుచు ఏదేని పువ్వు పేరు లేదా అక్షరంపేరు వ్రాసి తెల్పండి 12 నెలలకు మీ జీవిత ఫలితాలు రు 5/— లకే (Rs. 5/- only) పంపబడును.

"DESTROYER"

డిస్ట్రాయర్ ... అనవసరమైన వెంట్రుకలను తెలివిపాలో కుదుళ్ళనుంచి పూర్తిగ తొలగిస్తుంది తిరిగి రాకుండ నివారిస్తుంది.

డిస్ట్రాయర్ చర్మాన్ని మెత్తగ, నున్నగ శిశువు చర్మంవలె ఉంచుతుంది చర్మానికి మంట పుట్టించదు, నిరపాయకరమైనది. వెల బుడి 1కి రు. 3 లు పోస్టేజిఅదనం. పూర్తి కోర్సు 3 బుడ్లు రు. 8—00

"Correspondent in English"
UNITED COMMERCIAL CO,
(A. M. W. 12/75)
Beat No. 32, Flat Door 3884x
Ambala Cantt 133001 (N. I.)

**మీకు సంతానం లేదా ?**



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణు లనేకులు మా సలహాలచే సంతాన వంతులయి యిచ్చిన యోగ్యతా పత్రములు గలవు. స్త్రీ, పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు.

ఉచిత వివరములకు

శ్రీ నాగార్జున మూలిక కుటీరం

రైల్వేస్టేషన్ వద్ద, శివాలయం వీధి.
తెనాలి - 2.


## సంబరాలు

వరకు ఎవరితోనూ గట్టిగా అనవద్దని నాతో నెమ్మదిగా అన్నాడు.

అయినా ఈ సంగతి చూచాయగా కొందరికి తెలిసినట్లుంది. చైర్మనుగారంటే గిట్టని కొందరు "ఈ చైర్మను పని అయింది, సినిమా యాక్టరుని తీసుకొచ్చి వెలిగిపోదా మనుకున్నాడు" అనుకుంటున్నారు. ఈలోగా పదిమంది జనంతో ఒక నల్లకారు వచ్చింది. ఎవడో గడుగ్గాయ అది సుందర్‌కుమార్ కారే అన్నాడు. దాంతో చాలమంది జనం విరగబడి కారు దగ్గరికి పరుగెత్తుతున్నారు. నాకు ఇంకా ఆశ్చర్యం అనిపించిందేమిటంటే ఇందాక రికార్డింగు డాన్సు వాళ్ళని తిట్టిన ఇద్దరు ముగ్గురు సంసార స్త్రీలు కూడా ఆ పరుగు లెత్తుతున్న వాళ్ళలో ఉండడం. అయినా, ఇలా పదిమందితోపాటు కారులో ఇరుక్కుని రావలసిన అగత్యం సినిమా యాక్టర్లకి పట్టదనే చిన్నవిషయం ఈ హడావుడి పడుతున్న వాళ్ళలో ఒకళ్ళకీ తట్టినట్లు తోచలేదు. నలుగురు వాలంటీర్లు వచ్చి సుందర్‌కుమార్ ప్రోగ్రాం కేన్సిలయినట్లు చెప్పడంతో తిట్టుకుంటూ చెల్లాచెదరయిపోయారు జనం.

రథం గుడి నుంచి రచ్చబండ వరకూ లైటింగుతో వెళ్ళి, తిరిగి గుడి వద్దకు వచ్చేసరికి తెల్లారిపోతుందట. ఎందుకంటే వీధి లైట్లు నుంచి కనెక్షన్ రథానికి ఇచ్చుకోవాలి జాగ్రత్తగా. అంత స్థిమితంగా రథంతోపాటు వెళ్ళే ఓపిక లేకపోవడంతో రాత్రంతా సినిమా హాల్లోనే కునికిపాట్లు పడవచ్చులే అనుకుని సినిమా హాల్లోకి మళ్ళీ దూరాను.

* * *

ఆఖరి సినిమా అయిపోయి, నేను ఇవతలికి వచ్చేసరికి అరున్నరయిపోయింది. నాయుడు గారుకూడా అన్నీ సర్దుకుని తిరుగు ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాడు. రాత్రంతా సరిగా నిద్ర లేకపోవడంతో చాలా అలసటగా ఉంది. అలాగే కాఫీ తాగేసి ఏడు గంటలకి బస్సులో కూర్చున్నాము.

బస్సు బయలుదేరుతోందనగా ఒక కుటుంబం చాలా పెద్ద సామానులతో ఎక్కింది. వాళ్ళని ఎక్కడో మునుపు చూసినట్లుగా అనిపించి కాళ్ళవేపు తేరిపార చూస్తోంటే

త్వరలో ప్రారంభం

మనుగడలో మలుపులు

కొత్త సీరియల్

నాయుడు రహస్యంగా "అయ్యవార్లు రాత్రి రికార్డింగు డాన్సు చేసిన అమ్మాయి అంత బాగుందా?" అన్నాడు వేళాకోళంగా. బిత్తరపోయాను. మళ్ళీ జాగ్రత్తగా చూశాను. రాత్రి వేషకట్టు బాపతు పౌడరు కొద్దిగా మొహానికి అంటుకుని ఉండకపోతే ఆమెను గుర్తుపట్టడం చాలా కష్టం అయి ఉండేది. రాత్రి ఒంటిమీద తిన్నగా బట్టలులేని మనిషే ఇప్పుడు మెడలో నల్లపూసలు, పసుపుతాడు వేసుకుని (చీర కూడా కట్టుకుని) ఒడిలో పిల్లాడిని కూర్చోబెట్టుకున్న మనిషని ఎల్లా గనుకోగలను ?

నా ఆలోచనలు నాయుడు గ్రహించినట్లున్నాడు బాగా. "మీకు నమ్మకం కలగడం శానా కష్టం. వాళ్ళు నాకు బాగా తెలుసు. ఎందుకంటే వాళ్ళు ప్రోగ్రాములిచ్చే శానా చోట్ల లైటింగు మేమే ఇస్తాము" అంటూ, "ఆ ప్రోగ్రాం వాళ్ళంతా ఒకే కుటుంబం వాళ్ళు. ఆమె పక్కన కూర్చున్నాయన ఆమె భర్త. చివార్న కూర్చున్న ముసలాయన ఈ ప్రోగ్రాములని ఆర్గనైజ్ చేస్తాడు. ఒకప్పుడు ఆయన సన్నాయి బాగా వాయించేవాడు. ఇప్పుడు సన్నాయి ప్రోగ్రాముకి నూరు రూపాయల కంటే ఎక్కువ ఇచ్చేడిలేదు. రికార్డింగు డాన్సు కయితే మున్నూరు (మూడువందలు) ఇస్తారు. రోజులు మారుతుండాయి. మారుతుండే రోజుల్తో ఈ విధంగా వాళ్ళు రాజీ పడుతుండారు" అంటూ చెప్పుకొచ్చాడు.

* * *

రాత్రి జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటిగా గుర్తుకొచ్చాయి. పైకి తిటినా ఇటువంటి ప్రోగ్రాముల మీద మనసు పడుతూ పరోక్షంగా ఇటువంటి కుప్పిగంతుల్ని ప్రోత్సహించే మన కుసంస్కారం ముందు పొట్ట పోసుకోవడానికి వీళ్ళు చేస్తున్న జుగుప్సాకరమైన ఈ డాన్సుల్లోని ఏహ్యత ఏపాటిది?